క్లుప్తంగా

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి



లీలావతి (ఫైల్)

ఎల్కతుర్తి : క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల 20వ తేదీన గడ్డి మందు తాగిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని దామెర గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెర గ్రామానికి చెందిన గాజుల లీలావతి(75) గత రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెను ఆస్పత్రిలో చూపించగా క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. దీనికి తోడు బీపీ, శుగర్ ఉండడం వలన లీలావతి జీవితంపై విరక్తి చెంది ఈనెల 20వ తేదీన ఇంట్లో గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలో ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లీలావతి సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శలు..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు చీకట్ల జ్యోతి భర్త చీకట్ల సురేందర్ ఇటీవలే మృతి చెందాడు. ఈ మేరకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృదుని చిత్రపటాకి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, మండల అధ్యక్షుడు మండల సురేందర్, మాజీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మల్కపేటలో అనారోగ్యంతో మృతిచెందిన గుండెబోయిన భిక్షపతి కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎవరికీ ఇబ్బంది వచ్చినా ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలవంతుల రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, నాయకులు రజనీకాంత్, ప్రశాంత్, అశోక్, శ్రీను పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని నాగయ్యపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన అప్పని బుచ్చిరు కుటుంబాన్ని సోమవారం అసైన్డ్‌భూమిసమితి (ఏబీఎస్) అధ్యక్షుడు కలకోటి మహేందర్ పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందించారు. డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, బస్వారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని లింగమోరిగూడెం గ్రామానికి చెందిన గీతకార్మికుడు బుర్ర సత్తయ్య ప్రమాదవశాత్తు తాటిచెట్టుపైనే ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వేర్వేరుగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహేందర్, వెంకటేశ్వర్‌రావు, బొల్లెపల్లి మధు, రాకేశ్‌రెడ్డి, కొత్తూరి మధుకర్, బుర్ర రాజ్‌కుమార్, బరిగల ఆరోగ్యం, బుర్ర రాజశేఖర్, ఆరోగ్యం, శ్రీహరి ఉన్నారు.

చేయూత

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో ఇటీవల మృతిచెందిన గోవిందు రవి కుటుంబానికి ఆయన బాల్యమిత్రులు చేయూతనిచ్చారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కొంత ఆర్థిక సాయం అందించారు. మహేష్, మధు, శ్రీకాంత్, అశోక్, సంజీవ్, రాజు, రాజేష్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పరకాల : భారతీయ జీవిత భీమా ఏజెంట్ల సమాఖ్య(లియాఫీ) పరకాల బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పరకాలలో జరిగిన మూడో సర్వసభ్య సమావేశానికి జోనల్ ఉపాధ్యక్షుడు పుసులూరి రమేశ్‌బాబు, వరంగల్ డివిజన్ ప్రధానకార్యదర్శి రావుల నారయణ, కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రరావు హాజరయ్యారు. వారి పర్యవేక్షణలో పరకాల బ్రాంచి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేములపల్లి కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడిగా వలిగె లింగారావు, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ యాకుబ్‌పాషా, ప్రధాన కార్యదర్శిగా దిండిగాల రజనీకాంత్, కోశాధికారిగా తోట రవీందర్, రెసడెన్సీ సెక్రటరీగా వడ్లకొండ భాస్కర్, జాయింట్ సెక్రటరీగా బాసాని సుధారాణి, రాచర్ల కుమారస్వామి, మీడియా సెక్రటరీ మార్క అశోక్, పైండ్ల శంకర్, డివిజన్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా రామన్నను ఎన్నుకున్నారు.

నేటి నుంచి మూగజీవాలకు టీకాలు

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని మూగజీవాలకు మంగళవారం నుంచి ముద్దచర్మవ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి ధర్మానాయక్ సోమవారం తెలిపారు. ఆవులు, దుక్కిటెడ్లు, 3నెలలకు పైబడిన ఆవుదూడలకు టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సైన్స్‌గ్రూపులకు మోక్షమెప్పుడో..?

- కళాశాల ఏర్పాటై 15 ఏళ్లు పూర్తి
- ఆర్ట్స్ గ్రూపులో రాష్ట్ర స్థాయి ఫలితాలు
- అందుబాటులోకి రాని సైన్స్ గ్రూపులు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థినులు



ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆత్మకూరు : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, అధికారుల నడవడిక క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. 15 ఏళ్ల నుంచి కొనసాగుతున్న కళాశాలలో సైన్స్ గ్రూపును అందుబాటులోకి తీసుకురాకపోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సైన్స్ గ్రూపు కోసం ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్‌గ్రూపులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సైన్స్ గ్రూపుల వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం ఆర్ట్స్ గ్రూపులు మాత్రమే అందుబాటులో ఉండగా కొందరు విద్యార్థులు సైన్స్ విద్యకు దూరమవుతున్నారు. భవిష్యత్‌లో డాక్టర్ కావాలనుకునే విద్యార్థులు బైపీసీ, ఇంజినీర్ కావాలనుకునే విద్యార్థులు ఎంపీసీ గ్రూప్ ఎంచుకుంటారు. అయితే ఈ లక్ష్యం నేరవేర్చుకునేందుకు స్థానిక విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుతోంది. సైన్స్ గ్రూపులు లేకపోవడంతో మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థిని, విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. బాలురు వ్యయప్రయాసలను ఓర్చికొని సుదూర ప్రాంతాలకు వెళ్లి సైన్స్ గ్రూపు ఎంచుకుని చదువుకుంటున్నారు. కానీ బాలికలను వారి తల్లిదండ్రులు ఇతర ప్రాంతాలకు పంపించకపోవడంతో చదువును మధ్యలోనే వదిలేస్తున్నారు.

వైఎస్సార్ హయాంలో ప్రారంభం..

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2009 సంవత్సరంలో ఏర్పాటు అయ్యింది. ఆ తర్వాత 2018 సంవత్సరంలో పక్కా గదులతో నిర్మించిన నూతన భవనంలోకి మారింది. పక్కా వసతులతో భవనం ఉన్నప్పటికీ సైన్స్ గ్రూపులు అందుబాటులోకి రాలేదు. ప్రిన్సిపాల్ బీ.ఎస్.రెడ్డి పర్యవేక్షణలో కళాశాల విద్యార్థులు సీఈసీ గ్రూపులో ప్రతి సంవత్సరం రాష్ట్ర, జిల్లా స్థాయి మార్కులు సాధించి పలువురి ప్రశంసలు పొందుతున్నారు. ఇప్పటికైనా కళాశాలలో సైన్స్ గ్రూపులు ఎంపీసీ, బైపీసీతోపాటు, ఒకేషనల్ గ్రూపులు అందుబాటులో తీసుకురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలి



ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులు లేకపోవడంతో విద్యార్థినులను కళాశాలకు పంపించలేకపోతున్నాము. ఆడపిల్లలను పట్టణాలకు పంపిండం ఇష్టం లేదు. స్థానికంగా సైన్స్ గ్రూపులు ఉంటే బాగుంటుంది.

– ఇర్సవడ్ల సదానందం

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించి 15 ఏళ్లు అవుతుంది. ఇప్పటి వరకు సైన్స్ గ్రూపులకు మోక్షం లేదు. సైన్స్ గ్రూపులు లేకపోవడంతో బాల, బాలికలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు దృష్టి వహించి సైన్స్ గ్రూపులను అందుబాటులోకి తీసుకురావాలి.

– మార్త రంజిత్

ఉన్నతాధికారులకు తెలియజేశాం..



కళాశాలలో సైన్స్ గ్రూపులు, ఒకేషనల్ గ్రూపులు మంజూరు చేయాలని గతంలోనే కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళాను. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు మరల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సైన్స్ గ్రూపులు ఏర్పాటుకు కృషి చేస్తాను.

– బీఎస్.రెడ్డి, ప్రిన్సిపాల్

మర్రికుంట వద్ద కొండ చిలువ..

ఐనవోలు : మండలంలోని నందనం గ్రామంలోని మర్రికుంట ఆకేరువాగు శివారులో సోమవారం సాయంత్రం కొండచిలువ కలకలం సృష్టించింది. సాయంత్రం అటువైపుగా వెళ్తున్న కొంతమంది బాటసారులు గమనించగా కొండచిలువ మర్రికుంట కట్ట వద్ద పొదల్లోకి వెళ్లింది. దీంతో గ్రామస్తుల్లో భయాందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి కొండచిలువను పట్టుకుని గ్రామస్తులకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా కాపాడాలని కోరుతున్నారు.



పొదల్లోకి వెళ్తున్న కొండచిలువ

సంక్షిప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపూర్ : మండలంలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళ, బుధ వారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని విద్యుత్‌శాఖ సెక్షన్ ఏఈ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనిగరం, గూనిపర్తి గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫీడర్లలో మిడిల్ పోల్స్ వేస్తున్న కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.1,80లక్షల జరిమానా

ఎల్కతుర్తి: గుడుంబా విక్రయించిన నలుగురు మహిళలకు రూ.1.80లక్షల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రమోహన్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో ఇటీవలే గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. గుడుంబా విక్రయిస్తున్న నలుగురు మహిళలపై కేసులు నమోదు చేసి సోమవారం స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. దీంతో తహసీల్దార్ నలుగురు మహిళలకు రూ.1,80,000 జరిమాన విధించినట్లు సీఐ పేర్కొన్నారు. ఇకముందు నాటుసారా కేసులో పట్టుబడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పాఠశాలపై చర్య తీసుకోవాలి

కమలాపూర్ : మండల కేంద్రంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కేరళ మోడల్‌స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఉప్పల్‌కు చెందిన ఎలిగేటి సతీష్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు నిలేష్ కేరళ మోడల్‌స్కూల్‌లో పదోతరగతి వరకు చదివాడని, ఈ నెల 18వ తేదీన పదోతరగతి మెమో కోసం పాఠశాలకు వెళ్లినట్లు తెలిపారు. అయితే తాను ఇంకా ఫీజు బకాయి ఉన్నాయని, మొత్తం ఫీజు చెల్లిస్తే మెమో ఇస్తామని యాజమాన్యం చెప్పినట్లు ఆరోపించాడు. అయినప్పటికీ రూ.10 వేలు చెల్లించానని అయినా మెమో ఇవ్వకుండా మరో రూ. 10 వేలు చెల్లిస్తే మెమో ఇస్తామని చెప్పడం అన్యాయమని వాపోయాడు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్న కేరళ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ దేవేందర్‌రావుపై చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలన్నారు.

కబ్జాదారులపై చర్య తీసుకోవాలి



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయానికి ఆనుకొని ఉన్న ఎస్సారెస్పీ కాల్వ కబ్జాకు గురైందని, కబ్జాదారులపై చర్య తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవణ్‌కల్యాణ్ కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందించారు. ఎస్సారెస్పీ కాల్వ కబ్జాకు సహకరించిన అధికారులపై కూడా చర్య తీసుకోవాలని కోరారు. కల్వాను కబ్జా చేయడం వలన పొలాలకు నీళ్లు రావడంలేదని రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్కతుర్తి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కొనసాగే హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టణాల్లోని క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ రవీందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 10 గంటలకు పీడీ రాముడును సంప్రదించాలని కోరారు.

యాకర గణేశ్‌కు సేవాగురు అవార్డు



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన యాకర గణేశ్‌కు వాల్మీకి ఫౌండేషన్ సేవాగురు అవార్డుతో సత్కరించింది. ఈనెల 22వ తేదీన శంకర్‌పల్లి మండలం జన్వాడలో వాల్మీకి ఫౌండేషన్ 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆడ పిల్లల్లో బ్యాడ్ టచ్, గుడ్ టచ్ టాయ్‌ని రూపొందించడంతో పాటు పిల్లల్లో సోషల్ అవేర్నెస్, సెన్సిటివ్ అంశాలపైన అవగాహన కల్పిస్తున్నందున సేవగురు అవార్డుతో సత్కరించినట్లు యాకర గణేశ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టర్కీకి చెందిన ఓరాన్ యాల్మన్ ఓకన్, వాల్మీకి ఫౌండేషన్ సభ్యులు పద్మశ్రీ డాక్టర్ మంజుల, డాక్టర్ రోహిణి, డాక్టర్ శివానంద్‌రెడ్డి, వివేక్ వర్మల చేతుల మీదుగా జ్ఞాపికను అందుకోవడం సంతోషంగా ఉందని గణేశ్ తెలిపాడు.

అభినందించిన ఎమ్మెల్యే, టెస్కాబ్ చైర్మన్



ఐనవోలు : లింగమోరిగూడెం గ్రామానికి చెందిన గుల్‌పాషా ధైర్య సాహసాలను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వేర్వేరుగా అభినందించారు. ఆదివారం గ్రామానికి చెందిన బుర్ర సత్తయ్య ప్రమాదవశాత్తు తాటిచెట్టుపైన మృతిచెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని కిందకుదింపే క్రమంలో గుల్‌పాషా ధైర్యసాహసాలు ప్రదర్శించి సుమారు 60 మీటర్ల చెట్టుపైకి నిచ్చెన సహాయంతో ఎక్కి మృతదేహాన్ని కిందికి దింపాడు. కాగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అభినందించారు.

గుడిసెవాసులకు పట్టాలు, మీటర్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ఇల్లు లేక, ఇంటి కిరాయి కట్టలేక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు జీఓ నంబర్ 58 ప్రకారంగా పట్టాలు, కరెంటు మీటర్లు ఇచ్చి, మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అనేక ప్రభుత్వ భూములు, చెరువు శిఖాల్లో అనేకమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాగా వేసి కబ్జా చేసి వ్యాపారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి భూములను భూ బకాసురుల నుంచి రక్షించడం కోసం ఇల్లు లేని నిరుపేదలతో పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేయించినట్లు చెప్పారు. అనంతరం నాయకులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.ప్రభాకర్ రెడ్డి, ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, గొడుగు వెంకట్, జిల్లా నాయకులు గాదె రమేష్, ఆలకుంట యాకయ్య, పెండ్యాల రవి, మంద మల్లేశం, కారు ఉపేందర్, కుక్కమూడి రవీందర్, వల్లెపు రాజు, లింగమూర్తి, నోముల కిషోర్, జంపాల రమేష్, బొట్ల కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల ఆరోగ్య భద్రతే శాఖ లక్ష్యం

మామునూరు: స్పెషల్ పోలీసులకు మానసిక ఒత్తిడిని దూరం చేసి, ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పించడమే పోలీస్‌శాఖ లక్ష్యమని కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని టీఎస్ఎస్‌పీ నాలుగో బెటాలియన్‌లోని యూనిట్ ఆస్పత్రి ప్రాంగణంలో బేగంపేట్ మెడీ కవర్, వాసన్ ఐకేర్ వరంగల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ కె.సాకేత్, సుమన్ బానిక్, శశిధర్, ప్రకాశ్, గోవింద్‌కుమార్, అన్వేషినితో కలిసి వైద్య శిబిరాన్ని కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో శ్వేత, శివ, ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, ఇన్‌స్పెక్టర్లు శోభన్‌బాబు, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, ఫార్మసిస్ట్ జలగం రమేష్‌కుమార్, సురేష్, రంజిత్‌కుమార్, నవీన్, మనోహర్‌రావు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరుద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

ఎల్కతుర్తి : ఉపాధ్యాయుల పదోన్నతులు, ఖాళీల భర్తీని డీఎస్సీతో జతపర్చాలని కోరుతూ భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సోమవారం పలువురు నిరుద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీ పరీక్ష నెలరోజులు వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ద్వారా 25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో జారీ చేసిన 5,089 టీచర్ పోస్టులకు మరో ఆరువేలు కలిపి 11,062 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారని, ప్రస్తుతం టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ముగింపు దశలో ఉన్న సందర్భంగా కొత్తగా 15వేల టీచర్ పోస్టులు ప్రస్తుత డీఎస్సీలోనే జత చేసి 25వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షల ఆన్‌లైన్ విధానం రద్దు చేసి ఆగస్టు నెలలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, హేమలత, మౌనిక, రాజు, సతీష్ పాల్గొన్నారు.

సార్లకు సమయపాలన లేదు..!



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

దామెర : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు సిబ్బంది కోసం ఎదురుచుస్తూ పడిగాపులు కాస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి రావల్సిన ఉద్యోగులు.. సోమవారం ఉదయం 11.30 గంటలు దాటినా కార్యాలయానికి ఒక ఈజీఎస్ అధికారి, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే సకాలంలో విధులకు హాజరు అయ్యారు. మిగిలిన కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కార్యాలయంలో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఒక సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్నారు. కాని ఇందులో ఒకరు కూడా సమయానికి కార్యాలయానికి రాలేదు. దీంతో ప్రజాపాలన దరఖాస్తుల సవరణ కోసం కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులు కార్యాలయం ముందు, చెట్ల కింద కూర్చొని వేచిచూశారు. పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం కార్యాలయంలో కొద్దిసేపు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని ప్రజలు అంటున్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రధానోపాధ్యాయురాలిపై చర్య తీసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

పరకాల : పట్టణంలోని ఎస్సీ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని 5 సంవత్సరాలుగా వినియోగించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఆమెకు సహకరించిన జిల్లా, మండల విద్యాశాఖాధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సేవా సమితి వ్యవస్థాకుడు బొచ్చు చిన్ని కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తాకు వినతిపత్రం అందించారు. 2018 సంవత్సరంలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాల భవనంలో తిరిగి 2024 సంవత్సరంలో తరగతులు పునః ప్రారంభించడానికి అంతర్యమేమిటో విచారణ జరిపించాలని కోరారు. పేద విద్యార్థులకు చదువును దూరం చేసిన ప్రధానోపాధ్యాయురాలు సునందపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిన ఏంఈఓ రమాదేవి, డీఈఓ అబ్దుల్‌హై పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన విద్యా విధానంపై శిక్షణ



అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న శిరీష

కమలాపూర్ : భీమదేవరపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కమలాపూర్ మండలంలో గల అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం నూతన విద్యా విధానంపై మూడురోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. మండల కేంద్రంలోని కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో మాస్టర్ ట్రైనర్, ఐసీడీఎస్ కమలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.శిరీష శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మండలస్థాయి పోటీలకు హాజరుకావాలి

దామెర : క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం మంగళవారం మండల స్థాయి ఎంపీకలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రమాదేవి, మండల నోడల్ అధికారి జుమ్మా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని హకీంపేట్, హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో గల క్రీడా పాఠశాలల్లో విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి, 5వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎంపీకకు హాజరుకావాలని వెల్లడించారు. 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగష్టు 31 మధ్యలో జన్మించినవారు అర్హులని సూచించారు. హాజరయ్యే విద్యార్థులు ఆధార్ వర్జినల్, బోనోఫైడ్, డేటాఫ్ బర్త్, క్లాస్3 ప్రోగ్రెస్ రిపోర్ట్‌తో ఎంపీకలకు హాజరుకావాలని ఈ సందర్భంగా ఎంఈఓ రమాదేవి కోరారు.

వయోవృద్ధులకు మెరుగైన వైద్య సేవలందించాలి



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఎంజీఎం: వయోవృద్ధులకు ఎంజీఎం ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు నెలకొల్పి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య కోరారు. ఈమేరకు ఎంజీఎం ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంజీఎంలోని ఓపీ విభాగాన్ని అసోసియేషన్ నాయకులు సందర్శించి వయోవృద్ధులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం -2007 చట్టం మేరకు రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వయోవృద్ధులకు వైద్య సేవలందించిన ఘనత ఎంజీఎం ఆస్పత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరసయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యుడు గంగారపు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.